## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునిపల్లి(అందోల్): 33 కేవీ సదాశివపేట సబ్ స్టేషన్ పరిధిలో మునిపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో మరమ్మతు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ప్రశాంత్ ఆదివారం తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### భక్తిభావం పెరగాలి



పాదయాత్ర చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని పలువురు భక్తులు అన్నారు. పట్టణంలో ఆదివారం హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించింది. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. పట్టణంలోని ఎస్‌జీఎస్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతంలో నిర్వహిస్తే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు, పిల్లలు కూడా హాజరయ్యారు. నగర సంకీర్తనలో భక్తుల సంఖ్య పెరగడం సంతోషకరమన్నారు. కాగా, భక్తులకు నిర్వాహకులు అల్పాహారం అందజేశారు.

### వ్యవసాయ భూముల్లో శంకు పురుగులు



చిన్నచల్మెడలో శంకు పురుగులు

మునిపల్లి(అందోల్): శంకు పురుగులు పత్తి పంటలను నాశనం చేస్తున్నాయని కాంగ్రెస్ మండల నాయకులు వీరన్న పాటీల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని చిన్నచల్మెడలో ఆయన మాట్లాడారు. శనివారం రాత్రి వర్షం పడటంతో శంకు పురుగులు గ్రామంలోని ఇళ్లలో, వ్యవసాయ భూముల్లో తిరుగుతున్నాయన్నారు. వాటిని ఎలా అరికట్టాలో తెలియక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులను కోరారు.

### నేడు అభిప్రాయాల సేకరణ

వట్‌పల్లి(అందోల్): జిల్లా సహకార శాఖ ఆదేశానుసారం రైతుబంధు పథకం అమలుపై సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు, సూచనలను స్వీకరించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ శ్రీకాంత్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఖాదిరాబాద్ పీఏసీఎస్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ వినోద్‌గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

### వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

జోగిపేట(అందోల్): డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత షుగర్ పరీక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ కె. అనంతరెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జోగిపేటలోని డీఎస్ రెడ్డి ఆస్పత్రి ఆవరణలో ఉచిత షుగర్ పరీక్షలు చేస్తారన్నారు. ఈ పరీక్షలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రతి శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు చేస్తామన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ జగదీశ్వర్, అధ్యక్షుడు అల్లె శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమానికి క్లబ్ సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

### మూర్ఛతో పడిపోయి..



గుర్తు తెలియని వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: మూర్ఛతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని పటాన్‌చెరు పోలీసులు ప్రజలను విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి మూర్ఛతో పడిపోతే స్థానికులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న వ్యక్తి స్పృహలో లేడని, అతడికి సంబంధించిన బంధువులు గానీ, తెలిసిన వారు ఉంటే పోలీసులను సంప్రదించాలని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## చదువులో రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ బస్వరాజ్

విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులకు సొంత ఊరికి పేరు తేవాలని ఎంఈఓ బస్వరాజ్ అన్నారు. జయ విజ్ఞాన భారతి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో డిగ్రీ విద్యార్థులకు మోటివేషనల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు హాజరై విద్యార్థులు ఏయే కోర్సులు తీసుకోవాలో ఎలా రాణించాలో తెలిపారు. పోలీస్, గ్రూప్స్, సివిల్స్ పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలి అనే ఇతర విషయాల గురించి కూడా చెప్పారు.

– జహీరాబాద్ టౌన్

## యువతకు ప్రోత్సాహం

ప్రధాని మోదీ 111వ మన్ కీ బాత్‌ను పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు వీక్షించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రధాని ప్రసంగాన్ని పట్టణ అధ్యక్షులు ద్వారకా రవి, మన్ కీ బాత్ ప్రోగ్రాం కన్వీనర్ దోమల విజయకుమార్, కో–కన్వీనర్ అజయ్ వీక్షించారు. దేశంలో కొత్త ఆవిష్కరణ చేస్తున్న యువతను ప్రోత్సహిస్తూ దేశ పరిస్థితులను ప్రజలకు అవగాహన కల్పిస్తూ మోదీ ప్రసంగాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఒక్కో ఎపిసోడ్‌లో ఒక విశిష్టమైన ప్రస్తావన ఉంటుందన్నారు.

– సంగారెడ్డి




మోదీ మన్ కీ బాత్ ప్రోగ్రాం చూస్తున్న నాయకులు

## స్నేహమంటే ఇదేరా !



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. 2003–04 సంవత్సరానికి గాను దౌల్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కొందరు ఉద్యోగులుగా స్థిరపడగా మరి కొందరు వ్యాపారస్తులుగా స్థిరపడ్డామని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం సహ పంతి భోజనం చేశారు.

– హత్నూర( సంగారెడ్డి)

# సమస్యల పరిష్కారంలో వైఫల్యం

**విద్యుత్ శాఖ సిబ్బందిపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం**

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో శాఖ సిబ్బంది విఫలమయ్యారని ఖాజిపల్లి ఎంపీటీసీ భార్గవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రమైన జిన్నారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రవీందర్ గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ నివేదికలను ప్రజాప్రతినిధులకు వెల్లడించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని విద్యుత్ శాఖ ఏఈపై వారు మండిపడ్డారు. మండల ఆర్అండ్‌బీ తన నివేదికను వినిపించిన వెంటనే, జంగంపేట నుంచి వావిలాల వరకు ఉన్న రోడ్డు సమస్యను ఎందుకు పరిష్కరించలేదని వావిలాల పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డి నిలదీశారు. ఖాజిపల్లిలో సర్వే నంబర్ 181లో గల ప్లాట్ల స్థలాలను అక్రమంగా దున్నిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీటీసీ భార్గవ్ ప్రశ్నించారు. ఈ విషయమై నిందితులను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక పంపామని త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. చివరిగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలో చాలా వరకు సమస్యలను పరిష్కరించామన్నారు. ఇంకొన్ని మిగిలిపోయాయన్నారు. అనంతరం మండల ఎంపీటీసీలను, అధికారులను, పాత్రికేయులను ఎంపీపీ రవీందర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం వారూ ఎంపీపీని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఎంపీపీ రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

## దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

**నవభారత్ నిర్మాణ్ యువసేన జిల్లా అధ్యక్షుడు శ్రీధర్**

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ అన్నారు. ఆదివారం పటాన్ చెరు మండలం ఇస్నాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో టీఎండీఏ(తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో ఈ విషయమై సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. 2016 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు పరచాలన్నారు. వారిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు లింగయ్య, మహేశ్, సంపత్, శేఖర్, లక్ష్మి, పద్మ, అంబబాయి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో నవభారత్ నిర్మాణ్ యువసేన జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

# బసవ వచనాలు పఠించాలి

జహీరాబాద్ టౌన్: విశ్వగురువు బసవేశ్వరుడి వచనాలను రోజూ పఠించాలని, అలాగే ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్త హరిశయ సంఘం ఉపాధ్యక్షుడు అంబాజీ పేర్కొన్నారు. పట్టణంలోని మహీంద్ర కాలనీ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో బసవ మండపంలో ఆదివారం సామూహిక ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అంబాజీ మాట్లాడుతూ 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు కులరహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. అప్పట్లో అణగారిన జాతుల ప్రజలను ఆదరించి గౌరవించారన్నారు. మహిళలకు పెద్ద పీట వేశారని, వారికి ఉన్నత పదవులను కట్టబెట్టారన్నారు. హరే రామ హరే కృష్ణ సంస్థ ప్రతినిధి డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నాయకులు రాంచందర్ భీంవంశీ, శ్రీనివాస్, బుడగ జంగం సంఘం అధ్యక్షుడు అంజన్న, కవి పెద్దగొల్ల నారాయణ, సమాజ సేవకులు మక్సూద్ తదితరులను సన్మానించారు.



దళిత సంఘాల నాయకులు, సమాజ సేవలకును సన్మానిస్తున్న సంఘం నాయకులు

## బ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా మనోజ్

ఝరాసంగం(జహీరాబాద్): బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్ పాండే సమక్షంలో బ్రాహ్మణ సంఘం ఝరాసంగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మనోజ్ కుమార్ దేశ్‌ముఖ్, ఉపాధ్యక్షులుగా కేదార్ చౌతాయి, శంకరరావు, గౌరవాధ్యక్షులుగా దిలీప్ కుమార్ జోషి , హరికిషన్ జోషిలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా భీమ్‌రావు కుల్కర్ణి, సంయుక్త కార్యదర్శిగా చంద్రకాంతారావు, కేతన్ చౌతాయి, కోశాధికారిగా శశికాంత్ రావు, కార్యవర్గ సభ్యులుగా పద్మనాభరావు కుల్కర్ణి, భీమ్‌రావు కుల్కర్ణి, లక్ష్మీకాంతారావు, మాణిక్ రావు దేశ్‌ముఖ్, పవన్ జోషిలను ఎన్నుకున్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

జోగిపేట(అందోల్): పట్టణ భవసార్ క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్కర్ సుమన్, గౌరవాధ్యక్షుడిగా తాండలి విట్టల్ రావు, ఉపాధ్యక్షుడిగా పతాలే సుభాశ్‌లను ఎన్నుకున్నారు. కోశాధికారులుగా పటాల వెంకటేశం, చోల్కర్ సంతోశ్, సహాయ కార్యదర్శిగా తాండ్లే శ్రీనివాస్, దాండ్లే ప్రవీణ్‌లను కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఇంకా కార్యవర్గసభ్యులుగా పతంగి నవీన్, పతంగి అశోక్, నౌలె శంకర్, విజయ్ సాయి ముధల్కర్, గనూరే వినోద్, గనూరే నవీన్, భరాడే రఘువీర్, ముదల్కర్ సురేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రోడ్డు కోసం డీవైఎఫ్ఐ నిరసన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని యెట్టిగడ్డసంఘం– మలపాడ్ ప్రధాన రహదారి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అస్తవ్యస్తంగా గుంతలమయంగా ఉన్న మలపాడ్ రోడ్డులో ప్రయాణం ఇబ్బందిగా ఉందన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ పనులను చేపట్టకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

# గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కిరాణా షాపులో తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ

కల్హేర్(నారాయణఖేడ్): కిరాణా షాపులు, పాన్ డబ్బాల్లో గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్గాపూర్ ఏఎస్ఐ రవీందర్‌గౌడ్ హెచ్చరించారు. గుట్కా విక్రయాలపై ఆదివారం సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్‌లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిషేధిత గుట్కాలు, డ్రగ్స్‌లను ఎవరైన విక్రయించినా వాడినా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

## క్రికెట్ అభిమానుల సంబురాలు



గుమ్మడిదలలో జాతీయ జెండాను పట్టుకొని సంతోషం వ్యక్తం చేస్తున్న యువకులు

జిన్నారం(పటాన్‌చెరు): సౌతాఫ్రికాతో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా గెలుపొందగా.. గుమ్మడిదల యువకులు సంబురాలు జరుపుకొన్నారు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో 7 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ఇది ప్రజలను ఆనందడోలికల్లో ముంచింది. పట్టరాని సంతోషాల నడుమ టపాసులు పేల్చారు. ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకుంటూ పండుగలా చేసుకున్నారు.

## కరాటేలో బాలుడి ప్రతిభా

జహీరాబాద్ టౌన్: కోహీర్‌కు చెందిన అజయ్ కుమార్ ఎల్లో బెల్ట్, సర్టిఫికెట్లను అందుకున్నారు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన కరాటే టెస్ట్‌లో అతను పంచ్, కిక్, బ్లాక్‌లో ప్రతిభ కనబర్చాడు. దీంతో శిక్షణ నిర్వాహకుడు, ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ సాజిద్ చేతుల మీదుగా పసుపు బెల్ట్‌తోపాటు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. మాస్టర్ శ్రీధర్, రాజు, రాములు పాల్గొన్నారు.



గ్రాండ్ మాస్టర్ సాజిద్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న అజయ్‌కుమార్

## ఉద్యోగుల సేవలు మరువలేం

నారాయణఖేడ్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని, వారు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. ఆదివారం ఖేడ్ డిపోలో పని చేసిన మెకానికల్ నిస్సార్ అహ్మద్, కండక్టర్లు రాంశెట్టి, కిష్టయ్యలు పదవీ విరమణ పొందగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖేడ్ లాంటి మారుమూల ప్రాంతంలో ఉన్న డిపోలో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తుండటం వల్లే ఉత్తమ సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. సమావేశంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



## మ్యూజిక్ టీచర్‌కు సన్మానం



శంకర్ జోషి దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్ దంపతులు

జహీరాబాద్ టౌన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ పాఠశాల సంగీత ఉపాధ్యాయులు శంకర్ జోషి పదవీ విరమణ చేయగా దంపతులిద్దరిని ఆదివారం ఘనంగా సన్మానించారు. సంగీతానికి ఆయన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు, పలువురు ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

నారాయణఖేడ్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, సీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ పండరి, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి తదితరులు పరిశీలించారు. ర్యాకల్లోని దర్గా, పాండురంగ గుడి, సీసీ రోడ్డు, కట్టమైసమ్మ ఆలయం, బీరప్ప ఆలయం వద్ద హైమాస్ట్ వీధిదీపాలు, పాఠశాల వద్ద విద్యార్థులు నీటి ప్రవాహం నుంచి దాటేందుకు పనులు నిర్వహిస్తున్నారు.

## • అంబులెన్స్‌కు దారేది?



అంబులెన్స్ కుయ్.. కుయ్ అంటూ వస్తే సాధారణంగా దారి విడుస్తారు. అందులో ఎవరికి ఎలాంటి వైద్యసేవలు అవసరమో తెలియదు. దీంతో ఒక ప్రాణం నిలబడాలన్న ఉద్దేశం కనబడుతోంది. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉంది. అంబులెన్స్‌లను లైన్‌లో పంపిస్తున్నారు. ఆదివారం సాయంత్రం జోరువానలో ఒక వాహనదారుడు తన ఫాస్టాగ్ చెల్లింపులో సమస్య వచ్చి వాహనాన్ని ముందుకు పోనివ్వలేదు. దీంతో వెనుకనున్న అంబులెన్స్ ఆగాల్సి వచ్చిన పరిస్థితి కంకోల్ టోల్ గేట్ వద్ద కనిపించింది. ఈ విషయమై బాధ్యులపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

## ప్రతిభావంతులకు బహుమతులు

నారాయణఖేడ్: స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. ఇటీవల 'లక్ష్య–లక్ష్యం' పేరిట వివిధ పోటీలను నిర్వహించారు. ఆమేరకు ప్రతిభ చూపిన చిన్నారులకు డీఎం మల్లేశయ్య తన చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమం డిపోలో జరిగింది. నర్సింహులు, ఏఎంఎఫ్ దశరథరావు, పిల్లలు తల్లిదండ్రులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## నీట్ రద్దుకు అసెంబ్లీలో తీర్మానించాలి

నారాయణఖేడ్: నీట్ పరీక్ష రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానించి లోక్‌సభ ఆమోదం కోసం పంపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమెల మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీట్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ విషయమై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు.